సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 29 । మే । 2024



సిలబస్‌కే పరిమితం కావొద్దు..

అధ్యాపకులు సిలబస్‌కే పరిమితం కావొద్దని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. గణిత శాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో ఆయన మాట్లాడారు. - 8లో▸



దుబాయ్ వెళ్లేందుకు చోరీలు..

ఇంటి నిర్మాణంతో పాటు దుబాయ్ వెళ్లేందుకు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/30^0$

వాతావరణం

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధి కళాశాలలు ఎల్కతుర్తి, ధర్మసాగర్, వరంగల్ వెస్ట్, హసన్‌పర్తి, పరకాల (బాలికలు), పరకాల (బాలురు), ఆత్మకూరు, భూపాలపల్లి గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ ఏసీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణ ఉంటుందన్నారు. ఈఅవకాశాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని సూచించారు.

మోడల్ స్కూళ్లలో..

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లా అమీనాబాద్, బుధరావుపేట, గవిచర్ల, నెక్కొండ, పర్వతగిరి, వంచనగిరి మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 31లోగా www.tsmodelschools.comలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

701 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 701 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 8,425 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. అందులో 7,882 మంది పరీక్ష రాశారు. 543 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షకు జనరల్, ఒకేషనల్ కలిపి 2,209 మంది విద్యార్థులకుగాను 2051 మంది హాజరయ్యారు. 158 మంది గైర్హాజరైనట్లు గోపాల్ వివరించారు.

వరంగల్‌లో 156 మంది..

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 156 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి కె.మాధవరావు తెలిపారు. ఫస్టియర్‌లో 2,659 మంది విద్యార్థులకు 2,558 మంది, సెకండియర్‌లో 1,113 మంది విద్యార్థులకు 1,058 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

జూన్ 3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ అబ్దుల్‌హై మంగళవారం తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ 194 మంది, సెకండ్ లాంగ్వేజ్ 13, ఆంగ్లం పరీక్ష 201, గణితం 182 మంది, సామాన్యశాస్త్రం 217, సాంఘికశాస్త్రం 61 మంది విద్యార్థులు రాయనున్నారు. జిల్లాలో హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ఒక్కటే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లాలో 806 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డీఈఓ వాసంతి పేర్కొన్నారు. వీరి కోసం వరంగల్‌లో ప్లాటినం జూబ్లీ హైస్కూల్ (ఏ), ప్లాటినం జూబ్లీ హైస్కూల్ (బీ) పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 89199 74862 కంట్రోల్ రూం నంబర్‌లో సంప్రదించాలని డీఈఓ సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ యూఈఈయూ) వరంగల్ జిల్లా కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఈమేరకు హనుమకొండ పెద్దమ్మగడ్డలోని టీజీఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ మధుసూదన్ రావుకు యూఈఈయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని కోరారు. ఖాళీలు భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఎరియర్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూఈఈయూ నాయకులు ఎ.పూర్ణచారి, టి.రామకృష్ణ, బి.రమేశ్, బి.రాజు, సీహెచ్.కుమార్ పాల్గొన్నారు.

పర్సంటేజీల పందేరం

అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల

- అగ్రిమెంట్ నుంచి బిల్లు చేతికందే వరకు కమీషన్ వాటాలు
- పదేళ్లుగా బదిలీల్లేవు, సీట్లు వదలరు
- ఇటీవల పాత తేదీల్లో బదిలీ అధికారితో సంతకాలు
- కాంట్రాక్టర్లతో ఇంజనీర్ల కుమ్మక్కు



నగరంలో ఓ నిర్మాణంలో వాడిన నాణ్యత లేని ఇసుక, కంకర

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అక్రమార్కులకు కేరాఫ్‌గా మారింది. దశాబ్ద కాలంగా ఇక్కడ పైరవీలదే పైచేయిగా మారింది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఏటా రూ.వందల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఆయా పనులకు సంబంధించిన అంచనాల తయారీ, టెండర్ల కేటాయింపు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల బాధ్యతను ఇంజనీరింగ్ విభాగం చూస్తుంటుంది. ఇందుకోసం డ్రాయింగ్ సెక్షన్ అగ్రిమెంట్ సిబ్బంది నుంచి క్షేత్రస్థాయి వర్క్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఈఈ నుంచి ఎస్ఈ స్థాయి వరకు పనిచేస్తుంటారు.

కమీషన్లకు కక్కుర్తి పడి..

ఒక్కో ఇంజనీర్ నెలకు జీతం రూ. ఒక లక్ష నుంచి 2.60 లక్షల వరకు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఏఈలకు నెలకు 30 లీటర్ల పెట్రోల్ కూపన్లు, డీఈ, ఈఈ, ఎస్ఈ వరకు అద్దె కారుకు బల్దియా నెలకు రూ.35వేలు వెచ్చిస్తోంది. ఇంత మొత్తంలో జీతాలు, రవాణా సదుపాయాలు పొందుతూ.. అభివృద్ధి పనులు పది కాలల పాటు పదిలంగా ఉండేలా పర్యవేక్షించాల్సిన ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల మత్తులో గ్రేటర్ వరంగల్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఉన్నతాధికారుల అజమాయిషీ కొరవడడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఇక్కడి పరిస్థితి మారింది. ఇటీవల బదిలీ అయిన ఉన్నతాధికారితో 200 ఎంబీలపై పాత తేదీల్లో సంతకాలు చేయించిన ఘటన వెలుగులోకి రావడంతో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సీరియస్‌గా తీసుకున్నారు. ఫైళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

పదేళ్లుగా ఒకే చోట..



విస్తీర్ణంలో అయినా, ఆదాయంలో అయినా.. హైదరాబాద్ తర్వాతి స్థానం వరంగల్‌ది. అందుకని ఏఈ నుంచి ఎస్ఈ వరకు రూ.లక్షలు కుమ్మరించి ఇక్కడ పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. ఇక్కడికి బదిలీపై వచ్చి 7 ఏళ్ల నుంచి పదేళ్లు గడిచినా బదిలీల్లేవు. కనీసం డివిజన్లను విడవకుండా పైరవీలు చేసుకుంటున్నారు. నేరుగా కాకుండా ప్రత్యేకంగా మధ్యవర్తులను పెట్టుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేటర్లకు సైతం తమ వాటా రావడంతో కిమ్మనడం లేదు. దీంతో అభివృద్ధి పనులు దారి తప్పుతున్నా యి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు కొద్ది నెలలకే పగుళ్లు చూపుతున్నాయి.

కాంట్రాక్టర్ల గగ్గోలు

బిల్లులు సకాలంలో రావట్లేదని, కమీషన్ల భారం పెరిగిపోతోందని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. బడా కాంట్రాక్టర్లకు మినహా మధ్య, సాధారణ కాంట్రాక్టర్ల గిట్టుబాటు కాక నష్టపాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ అభివృద్ధి పనుల ప్రతిపాదనల తయారీ తర్వాత అధికారులు టెండర్లు పిలుస్తారు. ఔత్సాహికులైన కాంట్రాక్టర్లు 2 నుంచి 10 శాతం వరకు లెస్‌తో టెండర్ దక్కించుకుంటారు. అయితే.. కాంట్రాక్టర్లు పనుల్ని పూర్తి చేస్తే 15 శాతం సొమ్ము మిగులుతుంది. అగ్రిమెంట్ నుంచి పనులు ప్రారంభించి, వివిధ స్థాయిలో ఇంజనీర్లు, ఇతర ఉద్యోగుల నుంచి చెక్కు చేతికందే వరకు పర్సంటేజీల రూపంలో 13 శాతం సొమ్ము కాంట్రాక్టర్లు ముట్టజెప్పాలి. పోటీతో టెండర్ లెస్, పర్సంటేజీలతో రమారమి 4 నుంచి 12 శాతం వారిపై అదనంగా భారం పడుతోంది. దీంతో వారు ప్రతిపాదిత పనుల్లో 50 నుంచి 70 శాతం వరకు చేస్తూ.. అందులో నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోవడంలేదు.

ఇదీ.. పంపకాల తీరు

టెండర్ అగ్రిమెంట్ బిల్లు రికార్డు, చివరి చెక్కు చేతికందే వరకు ఏఈకి 3 శాతం, డీఈకి 2 శాతం, ఈఈకి 1 శాతం, ఎస్ఈకి 1శాతం, డీబీ సెక్షన్, 1.5 శాతం, క్వాలిటీ కంట్రోల్, ఆడిట్, అకౌంటింగ్ విభాగంలో, బిల్లులను ఆడిట్, చెక్కు రాసే అకౌంట్స్ విభాగానికి 1150 శాతం. కార్పొరేటర్లు(ఐదారుగురు మినహా) 2 శాతం ఇలా.. మొత్తంగా 13 శాతం వరకు కమీషన్ల రూపంలో చెల్లిస్తున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. టెండర్ లెస్, పర్సంటేజీలు పోగా.. లాభం పక్కన పెడితే చాలా మంది ఆర్థికంగా చితికిపోతున్నట్లు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో ఆరు రోజులే!

- వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు గడువు
- ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియడంతో అందరి చూపు అటువైపే
- లెక్కింపునకు అధికారుల ఏర్పాట్లు
- స్ట్రాంగ్ రూంలను సందర్శిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిషోర్‌ఝా



సాక్షి, వరంగల్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ముగియడంతో ఇప్పుడు అందరితోపాటు అధికారుల చూపు లోక్‌సభ ఎన్నికల ఫలితాల వైపు మళ్లింది. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌యార్డులోని 17, 18, 19 నంబర్ల గోడౌన్ల స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచిన ఈవీఎంలో నిక్షిప్తమైన వరంగల్ ఎంపీ అభ్యర్థుల భవితవ్యం మరో ఆరు రోజుల్లో తేలనుంది. ఈ కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏం పనులు చేయాలి, రోజువారీగా ఏయే అంశాలపై సమీక్షలు నిర్వహించాలనే దానిపై రిటర్నింగ్ అధికారులు సిద్ధమయ్యారు. ఈవీఎంలలో ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లలో ఓట్లను కంప్యూటర్లలో ఎలా నమోదు చేయాలో సిబ్బందికి వివరించారు. అదేసమయంలో స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. సాయుధ బలగాల పహారాతో పాటు పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే 144 సెక్షన్ విధించారు. తరచూ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ప్రావీణ్యతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా స్ట్రాంగ్ రూంలను సందర్శిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది, భద్రతా సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు.

కౌంటింగ్ సజావుగా సాగేలా..

న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, డాక్టర్ సుఖ్‌బీర్‌సింగ్‌సంధుతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ, సన్నద్ధతపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారి ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ ప్రావీణ్య ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై దృష్టి సారించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతతోపాటు కౌంటింగ్ కేంద్రంలో ఫలితాలు వెలువరించేందుకు మీడియాకు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేయాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఇంటర్నెట్ కనెక్షన్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ప్రత్యేక కౌంటింగ్‌హాల్ ఉండేలా ఏర్పాట్లు ఉండాలని ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్‌హాల్‌కు ఈవీఎంల తరలింపునకు అవసరమైన మేర సిబ్బంది ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ విధులు నిర్వర్తించే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న దృష్ట్యా ఉదయం 6 గంటలకే టేబుళ్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలింగ్ శాతం ఆధారంగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 28 టేబుళ్లు, కనిష్టంగా 14 టేబుళ్లను ఏర్పాటుచేశారు. పోలైన ఓట్లు, ఈవీఎంల ఆధారంగా టేబుళ్ల సంఖ్య పెంచనున్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానం పరిధిలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట నియోజకవర్గాలు ఉన్నాయి.

అభ్యర్థుల్లో గుబులు..

ఈ నెల 13న ఎన్నికలు ముగిసినా ఎంపీ అభ్యర్థుల్లో మాత్రం లోలోన గుబులు ఉంది. పైకి గెలుస్తామని అందరూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా రోజుకో యుగంలా ఫీలవుతున్నారు. మధ్యలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చేసరికి కాస్త మనస్సు అటువైపు మళ్లింది. సోమవారం ఆ ఎన్నిక కూడా ముగియడంతో తమ భవితవ్యం ఏమిటి? అనే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కాలక్షేపం చేస్తున్నారు. అయినా ఫలితం ఎలా ఉంటుందనేది మాత్రం వారిని వెంటాడుతూనే ఉంది. ఇంకోవైపు ఆయా స్ట్రాంగ్ రూంల వద్ద తమకు నమ్మకమైన అనుచరులను పంపించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా అక్కడి దృశ్యాలను తిలకిస్తూ షిఫ్టుల వారీగా అక్కడే ఉంటున్నారు. ఏదేమైనా మరో ఆరు రోజుల్లో వీరి భవితవ్యం తేలనుంది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రలోభాలకు గురిచేశాయి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్ రెడ్డి

హన్మకొండ: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశాయని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎన్ని డబ్బులు పంచినా.. వివిధ రకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా ఆ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేయలేదన్నారు. పట్టభద్రులు బీజేపీకి మద్దతుగా నిలిచారని, పోలింగ్ సరళిని బట్టి తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి సర్వే చేసిన వారే ఫోన్ చేసి చెప్పారని అన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో గతంలో ఎప్పుడూ బీజేపీ ప్రజాప్రతినిధులు ఎన్నిక కాలేదని, ఇప్పుడు మార్పు అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేయడానికి వచ్చిన పట్టభద్రులు మృతి చెందారని, ఇది బాధాకరమైన విషయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేవలం సన్న ధాన్యానికే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్‌కు తలదించుకునే పరిస్థితులు వచ్చాయని, ఆ కేసును సీబీఐకి అప్పగిస్తేనే సమగ్ర విచారణ జరిగి దోషులు బయటపడతారని అన్నారు. సమావేశంలో నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, వన్నాల శ్రీరాములు, సరోత్తంరెడ్డి, గురుమూర్తి శివకుమార్, కొండి జితేందర్‌రెడ్డి, ఎం.రాంచంద్రారెడ్డి, గుజ్జుల వసంత, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈ ఎవరు?

- ప్రచారంలో సీతారాం నాయక్, వెంకటేశ్వర్లు పేర్లు
- వరంగల్ సర్కిల్‌లో కోట్లాది రూపాయల పనులు..
- ఓంకార్ సింగ్ ఉత్తర్వులు రద్దు.. ప్రత్యామ్నాయంగా ప్రయత్నాలు
- చర్చనీయాంశంగా పదోన్నతులు, బదిలీలు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

నీటిపారుదలశాఖ వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) ఎవరనేది ఆ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆరు రోజుల క్రితం వరకు వెంకటేశ్వర్లు ఎస్ఈగా వ్యవహరించారు. ఆయన స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఉన్న ఓంకార్ సింగ్‌ను వరంగల్ సర్కిల్ ఎస్ఈగా నియమించారు. అయితే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరిపై నిర్మించిన బ్యారేజీలపై విచారణ జరుగుతుండగా.. ఆ విచారణ ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓంకార్‌సింగ్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)గా అదనపు బాధ్యతలు అప్పగించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నియామకంపైన కూడా 'అప్పుడు.. ఇప్పుడు అదే తంతు' శీర్షికన సాక్షిలో ఈనెల 26న ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. ఇంజినీరింగ్‌వర్గాల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారి ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈమేరకు ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఓంకార్‌సింగ్ బదిలీ ఉత్తర్వులు రద్దు చేశారు. కాళేశ్వరం లింకు–2లో ఈఈగా పని చేస్తున్న ఎస్.శ్రీధర్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో పదోన్నతులు, బదిలీల వ్యవహారం నీటిపారుదలశాఖలో హాట్ టాపిక్ అయింది.

రేసులో సీతారాం.. వెంకటేశ్వర్లు



వరంగల్ సర్కిల్ ఎస్ఈ బాధ్యతల నుంచి ఓంకార్ సింగ్‌ను తప్పించడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఈ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయం కాగల ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల పునరుద్ధరణ, లైనింగ్ పనులు నడుస్తున్నాయి. ఈనేపథ్యంలో వరంగల్ సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టేందుకు ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన కొందరు ఎస్ఈ, ఈఈ క్యాడర్‌లలోని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓంకార్‌సింగ్ కంటే ముందు ఎస్ఈగా ఉన్న వెంకటేశ్వర్లు మళ్లీ ప్రయత్నాలు చేస్తుండగా.. ఇదే సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీతారాంనాయక్ కూడా ఇన్‌చార్జ్ ఎస్ఈ కోసం ఉన్నతాధికారులను కలిసినట్లు చెబుతున్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉన్న మరో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కూడా ఈసీటుపై గురిపెట్టి పావులు కదుపుతున్నారన్న ప్రచారం కూడా ఇంజనీరింగ్ వర్గాల్లో సాగుతోంది.

పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం

సీడ్స్, పెస్టిసైడ్స్ షాపుల్లో అగ్రికల్చర్, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



ఏకశిలానగర్‌లోని డీలర్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్తి విత్తన ప్యాకెట్లు

వరంగల్ చౌరస్తా/ఖిలా వరంగల్ : రైతులకు నాసిరకం పత్తి విత్తనాలు విక్రయించారనే ఫిర్యాదులపై మంగళవారం వరంగల్ టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. వరంగల్ పాత గ్రెయిన్ మార్కెట్, ఏకశిల నగర్ ప్రాంతాల్లోని షాపుల్లో అక్రమంగా నిల్వ చేసిన పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. రామకృష్ణాపురం, బొల్లికుంట రైతులు మల్లిపెద్ది దేవకుమార్ ఫిర్యాదు మేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని మహాలక్ష్మి సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ షాపులో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. డీలర్ ఇంటి ఆవరణలో అక్రమంగా నిల్వ చేసిన 7067 నంబర్ 30ప్యాకెట్లు, నూజివీడు ఆద్య– 24 ప్యాకెట్లు, నాథ్ సాంకేట్ –19 ప్యాకెట్లు (మొత్తం రూ.63,072 విలువ) స్వాధీనం చేసుకున్నట్లు వెల్ల డించారు. అలాగే ఇతర పత్తి విత్తనాల బ్యాగులు(రూ.58,000 విలువ), అక్రమంగా నిల్వ చేసిన ప్రభుత్వం నిషేధించిన 58 ఎ గడ్డి మందు బాటిళ్లు సైతం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏకశిల నగర్, మేరీ మాత సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలరు ఇంట్లో వివిధ రకాల పత్తి విత్తన ప్యాకెట్లు 37 స్వాధీనం చేసుకున్నామని, మరికొన్ని షాపులతోపాటు గోదాంల తాళాలు తీయించి సోదాలు నిర్వహించామన్నారు. మొత్తంగా రూ.1,21,072 విలువ చేసే విత్తనాలు, ఇతర రసాయనాలు సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐలు రవికుమార్, సార్ల రాజు తెలిపారు. తనిఖీల్లో డీఏఓ ఉషాదయాళ్, ఏడీఏ నాగేశ్, ఏఈఓ విజ్ఞాన్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు నిస్సార్, అహ్మద్ పాషా, ఆర్ఎస్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

హన్మకొండ/కాళోజీసెంటర్ : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జూన్ 1వ తేదీలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు సీఈఓలు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఈఓతో కలిసి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో జిల్లా ఎన్నికల అధికారితో పాటు, ఒక ఇన్‌చార్జ్ అధికారిని నియమించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గుర్తించిన వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, ఎలాంటి రికార్డెడ్ డివైస్‌లను అనుమతించవద్దని సూచించారు. మీడియా కేంద్రంలో ఎప్పటికప్పుడు రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించేలా అదనపు ఏఆర్వోలను నియమించాలని చెప్పారు. మీడియాతోపాటు ప్రజలకు తెలిసే విధంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, వివిధ రకాల ఫారాలను సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. వీసీలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎన్నికల అధికారులు సిక్తా పట్నాయక్, పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, సీపీ అంబర్ కిషోర్‌ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే తదితరులు రెండు జిల్లాల్లో వేర్వేరుగా పాల్గొన్నారు.

నిబంధనల మేరకు కౌంటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ: ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ నిర్వహించాలని కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి కౌంటింగ్ నిర్వహణ, నమూనా ఈవీఎం ద్వారా ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. జూన్ 4న వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని కౌంటింగ్ కేంద్రాల్లో జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్‌లో ఎలాంటి జాప్యం జరగకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ఏఆర్‌ఓలు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల ఏఆర్‌ఓలు కె.నారాయణ, వెంకటేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: వర్షాకాలంలో నగర వ్యాప్తంగా ఉన్న ముంపు ప్రాంతాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై గూగుల్ ఎర్త్ మ్యాపు ద్వారా ఐటీ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు కేటాయించిన డివిజన్లలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సామర్థ్యం మేరకు నిర్మించని డ్రెయిన్ల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకుని సమస్యలకు పరిష్కార మార్గాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాలు కురిసే క్రమంలో డ్రెయిన్లు పొంగడానికి కారణాలను ఇంజనీర్లతో కలిసి అన్వేషించాలని చెప్పారు. కొన్ని కాలనీల్లో చెత్త సేకరించడం లేదని, కొన్ని వాహనాలు అనధికారిక ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి జరిమానా విధించాలని కమిషనర్ ఆదేశించారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం డంపింగ్ చెత్త తరలించాలని, ఫాగింగ్ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్ వైజర్లు సాంబయ్య, నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ స్కూళ్ల వసతులపై దృష్టి పెట్టాలి

పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్నందున అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పన పనులపై దృష్టి సారించి వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. టాయిలెట్ల నిర్మాణ సంబంధిత పనులు మినహా మిగతా అన్నీ ఈ నెల 31 లోగా పూర్తి చేయాలన్నారు. ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, సారంగం, రంగారావు, రవికిరణ్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల జోరు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు తీసుకొచ్చే ఆలోచనలో భాగంగా భూమి మార్కెట్ విలువలను పెంచేందుకు సమాలోచన చేస్తోంది. ఈనేపథ్యంలో మార్కెట్ వ్యాల్యూ పెరగక ముందే భూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు భూక్రయ విక్రయదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణంగా మంగళవారం రోజున 50లోపు రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా.. మార్కెట్ విలువ పెరుగుతుందనే సమాచారంతో మంగళవారం సెంటిమెంట్‌ను సైతం పక్కన పెట్టి వరంగల్ ఆర్ఓలో 93 దస్తావేజులకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. కాగా.. ఈ దస్తావేజుల రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.65 లక్షల ఆదాయం సమకూరింది.

క్లుప్తంగా

యునెస్కో పీస్ మెసెంజర్ అవార్డుకు 'గోకా' ఎంపిక


గోకా రామస్వామి

నర్సంపేట: వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన వనప్రేమికుడు, పర్యావరణ వేత్త గోకా రామస్వామి యునెస్కో పీస్ మెసెంజర్ అవార్డుకు ఎంపికయ్యారు. యునెస్కో కార్యక్రమాల్లో భాగంగా రామస్వామి నాలుగేళ్ల నుంచి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పలు సేవలందించారు. దీంతో యునెస్కో సెక్రెటరీ జనరల్ యోగేష్ కులశ్రేష్ట.. రామస్వామిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జూన్ 7, 8, 9 తేదీల్లో అస్సాంలో జరిగే 18వ అన్యూవల్ కాన్ఫరెన్స్‌లో అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా గోకా రామస్వామి మాట్లాడుతూ జూన్ 5న గౌహతిలో జరిగే యునైటెడ్ నేషన్ కాన్ఫరెన్స్‌లో, జూన్ 7న ఢిబ్రుగర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 40 మంది యునెస్కో ప్రతినిధులు పాల్గొంటారని, తెలంగాణ నుంచి ధర్మపురి రాజగోవింద్, గోకా నాగేశ్వర్‌రావుకు ఆహ్వానం అందిందని తెలిపారు.

మార్కెట్‌కు వరుసగా 6రోజులు సెలవు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు లోక్‌సభ – 2024 సాధారణ ఎలక్షన్ కౌంటింగ్ సందర్భంగా వరంగల్, హనుమకొండ కలెక్టర్ల ఆదేశాల మేరకు మార్కెట్ యార్డుకు శనివారం నుంచి గురువారం వరకు వరుసగా 6రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ(శనివారం)వారాంతపు యార్డు బంద్, 2వ తేదీ(ఆదివారం)వారాంతపు సెలవు, 3వ తేదీ(సోమవారం)నుంచి 5వ తేదీ వరకు(కౌంటింగ్), 6వ తేదీ అమావాస్య(గురువారం)తో సెలవు ప్రకటించినట్లు తెలిపారు. 7వతేదీ(శుక్రవారం)న మార్కెట్ పునఃప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని రైతులు, వ్యాపారులు, గుమస్తా, దడువాయి, కార్మికులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను బంద్ రోజుల్లో మార్కెట్‌కు తీసుకురావొద్దని కోరారు.

కంపెనీ యాజమాన్యం వేధింపులు తాళలేక..

- రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


తరుణ్‌కుమార్ మృతదేహం

రఘునాథపల్లి: కంపెనీ యాజమాన్యం వేధింపులు తాళలేక ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం..హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన కొలిపాక తరుణ్‌కుమార్ (29) వరంగల్‌లో హైదరాబాద్ హిందుస్తాన్ టవర్స్ కంపెనీలో ఫీల్డ్ సపోర్ట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల కంపెనీ యాజమాన్యం వేధింపులకు గురి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన తరుణ్‌కుమార్.. సోమవారం రాత్రి నిడిగొండ రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆర్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

డీటీఓపై ఏసీబీ దాడులు

- ఏజెంట్ల నుంచి రూ.45,100, డ్రైవర్ నుంచి రూ.16,500, జేఏ నుంచి రూ.895 నగదు స్వాధీనం
- డీటీఓ, ఎంవీఐ, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య


జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో అధికారులను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయం (డీటీఓ.. డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్)లో ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇందులో ఏజెంట్ల నుంచి రూ.45,100, డీటీఓ డ్రైవర్ నుంచి రూ.16,500, జూనియర్ అసిస్టెంట్ (జేఏ) నుంచి రూ.895 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కొద్దిరోజులుగా అవకతవకలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ సీవీ.ఆనంద్ ఆదేశాలతో దాడులు నిర్వహించామని తెలిపారు. ఇందులో డీటీఓ కార్యాలయంలో అనధికారికంగా ఉన్న ఆరుగురు ఏజెంట్లు, జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆరుగురు ఏజెంట్లు విశ్వప్రసాద్, రహీంపాషా, వెంకటయ్య, వీరేందర్, లక్ష్మీనారాయణ, విజయ్ కుమార్ వద్ద నుంచి రూ.45,100 నగదు, డీటీఓ డ్రైవర్ సుబ్బారావు వద్ద నుంచి రూ.16,500 నగదు, నూతన లైసెన్స్ పత్రాలు, రెన్యూవల్స్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్ (జేఏ) రవీందర్ వద్ద నుంచి రూ.895 నగదు స్వాధీనం చేసుకోగా కార్యాలయ కిటికీలో రూ.300 నగదు లభ్యమైందన్నారు. డీటీఓ కార్యాలయంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుసుకున్నామన్నారు. కౌంటర్లలో పనిచేసే ఉద్యోగుల వద్ద ప్రభుత్వ రిజిస్టర్లో ఉండాల్సిన డిక్లరేషన్ కన్నా ఎక్కువ నగదు లభ్యమైందన్నారు. రవాణా శాఖలో ఏజెంట్ల వ్యవస్థ లేదని, డ్రైవర్లు, అనధికార వ్యక్తులు కార్యాలయంలో ఉండొద్దన్నారు. డీడీలు, చెక్కులే ఉండాలన్నారు. అందుకు విరుద్ధంగా వారి వద్ద నగదు ఉందన్నారు. దీంతో డీటీఓ గౌస్ పాషా, ఎంవీఐ వెంకటపుల్లయ్య, జేఏ రవీందర్, ఇద్దరు డ్రైవర్లు అలెక్స్, సుబ్బారావుపై కేసు నమోదు చేశామన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, ఎల్.రాజు, ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులు సిలబస్‌కే పరిమితం కావొద్దు


మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: అధ్యాపకులు సిలబస్‌కే పరిమితం కావొద్దని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని గణితశాస్త్ర విభాగం సెమినార్‌హాల్‌లో రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఇంగ్లిష్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణిత విభాగాల అధ్యాపకులకు మూడు వారాల ఇండస్ట్రీయల్ శిక్షణ ప్రోగ్రాం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు తరగతి గదిలో సబ్జెక్టుతోపాటు ఇండస్ట్రీలో వస్తున్న మార్పులు, ఇన్నోవేషన్లు, కొత్త ఆవిష్కరణల గురించి వివరించాలన్నారు. అప్లికేషన్ ఓరియంట్‌గా బోధన ఉండాలని సూచించారు. పాలిటెక్నిక్ అధ్యాపకులు పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ జరగాలన్నారు. అప్పుడే విద్యార్థికి ఉపయోగం ఉంటుందన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ లాల్ మాట్లాడుతూ ఈ మూడువారాల శిక్షణలో మొదటి వారం కామన్ సబ్జెక్టులపై ఉంటుందన్నారు. అనంతరం విభాగాల వారీగా రెండు వారాల శిక్షణ ఉంటుందన్నారు. కృత్రిమ మేధా ప్రవేశం నేపథ్యంలో విద్యార్థులు ఉపాధి పొందేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫిజిక్స్ విభాగం అధిపతి సీజే శ్రీలత మాట్లాడుతూ మూడు వారాల ఇండస్ట్రీయల్ శిక్షణలో థియరీ, ప్రాక్టికల్స్ బోధన ఉంటుందన్నారు. కెమిస్ట్రీ విభాగం అధిపతి సవితాజ్యోత్స్న మాట్లాడుతూ కెమిస్ట్రీ సబ్జెక్టులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అడ్వాన్స్‌లు, ప్రయోగ పూర్వక బోధన నిష్ణాతులతో ఉంటుందన్నారు. ఇంగ్లిష్ విభాగం అధిపతి దీపాజ్యోతి మాట్లాడుతూ విద్యార్థి భాషానైపుణ్యాలు, మార్కెట్ అవసరాలు, సామర్థ్యాల పెంపుపై దృష్టిసారించేలా ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. సమావేశంలో ఎం రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బ్రహ్మేశ్వరి, ఆచార్య హనుమంతు, కంప్యూటర్ సైన్స్ విభాగం డాక్టర్ మంజుల, గణిత విభాగం డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

నిరసనకు పూజారులు సిద్ధం..

- నేడు అమ్మవార్ల దర్శనానికి అనుమతిస్తాం

ఎస్ఎస్‌తాడ్వాయి: వరంగల్‌లో మేడారం వనదేవతలకు కేటాయించిన స్థలాన్ని భద్రకాళి దేవస్థానం అధికారులు ఆక్రమించుకునే ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ నేడు(బుధవారం) మేడారం అమ్మవార్ల సన్నిధిలో సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులు నిరసన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. వరంగల్ ఎంజీఎం సమీపంలో వనదేవతలకు కొన్నేళ్ల క్రితం వెయ్యి గజాల స్థలం కేటాయించారు. ఇటీవల ఆ స్థలంలో మేడారం, భద్రకాళి, మెట్టుగుట్ట దేవస్థానాల ఆదాయం నుంచి రూ. 3కోట్లతో భవనం నిర్మించారు. భవనంలో మేడారం ఈఓ కార్యాలయం, అసిస్టెంట్ కార్యాలయం కొనసాగుతోంది. భద్రకాళి దేవస్థానం అధికారులు భవనం నిర్మించిన స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు మేడారం కార్యాలయంతోపాటు మరికొన్ని ఆఫీస్‌లను ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడంతో పూజారులు మంత్రులు, అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే, ఈనెల 29, 30న మేడారం అమ్మవార్ల దర్శనం నిలిపివేసి నిరసన చేపడతామని ప్రకటించారు. దీంతో దేవాదాయశాఖ కమిషనర్ స్పందించి పూజారులను హైదరాబాద్ పిలిపించి వారితో చర్చించారు. అమ్మవార్ల స్థలం విషయంలో కమిషనర్ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో పూజారులు నిరసన కార్యక్రమం చేపడుతున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అమ్మవార్ల దర్శనానికి అనుమతించి ఆలయ ప్రధాన ద్వారం సమీపంలో నిరసన చేపట్టనున్నట్లు పూజారులు తెలిపారు.

దేవతల దర్శనానికి భక్తులకు అనుమతి



వనదేవతలు సమ్మక్క, సారలమ్మను భక్తులు యథావిధిగా దర్శనం చేసుకోవచ్చు. ఆలయ ప్రధానమార్గం సమీపంలో పూజారుల కుటుంబీకులు, ఆదివాసీలతో కలిసి నిరసన చేపడుతాం. ఈ కార్యక్రమానికి అధికారులు సహకరించాలి.

– సిద్ధబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

వరంగల్ ఆర్టీఏకు ఏసీబీ భయం..!

- అప్రమత్తమైన అధికారులు
- వాహనదారులకు మాత్రమే కార్యాలయానికి అనుమతి
- మూతపడిన దళారుల సెంటర్లు


వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లా రవాణాశాఖకు ఏసీబీ భయం పట్టింది. యథేచ్ఛగా అవినీతి సాగుతుందన్న ఆరోపణలపై మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయంపై మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఈవిషయం తెలిసిన వెంటనే వరంగల్ ఆర్టీఏ కార్యాలయ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీబీ అధికారులు బృందాలుగా వీడిపోయి ఉన్నారని, ఏ క్షణమైనా ఇతర జిల్లాల ఆర్టీఏ కార్యాలయాలపై దాడులు జరిగే అవకాశం ఉందని ప్రచారం కావడంతో అధికారులు భయం..భయంతో పనులు చేశారు. పర్సులు, జేబులు, డిస్క్ డ్రాలో నగదు లేకుండా జాగ్రత్త పడ్డారు. దళారుల సెంటర్లపై కూడా ఏసీబీ అధికారులు నిఘా వేశారని, దాడులు చేసి వాహనదారుల ఫైల్స్‌ను పరిశీలించే అవకాశం ఉందని, ఫైళ్లు ఉంటే కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకుంటారని తెలిసి నిమిషాల్లో సెంటర్లన్నీ మూసివేశారు. అంతేకాదు ప్రధాన గేటు వద్ద విధులు నిర్వహించే హోంగార్డులను అధికారులు అప్రమత్తం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇతర పనులకు వచ్చే వాహనదారులను మాత్రమే అనుమతించాలని హోంగార్డులకు ఆర్టీఓ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఫైల్స్ ఉన్న వారిని మాత్రమే కార్యాలయానికి అనుమతించారు. జీరో కౌంటర్లల్లో జరుగుతున్న అవినీతి దందాపై ఏసీబీ అధికారులు ఆరాతీసినట్లు సమాచారం. ఒక్కో అధికారి ఒక అసిస్టెంట్‌ను నియమించి వారి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

ఉద్యోగాల పేరిట రూ.4కోట్లకు టోకరా

- రాష్ట్రంలోని 60మంది నుంచి వసూళ్లు
- పోలీసుల అదుపులో నలుగురి ముఠా


చుంచుపల్లి : నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గ్రూపు – 2, సింగరేణి, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.4 కోట్ల మేర వసూలు చేసిన నిందితులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వివరాలను సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. వరంగల్ రంగశాయిపేటకు చెందిన దాసు హరికిషన్ హైదరాబాద్ ఎర్రమంజిల్‌లో ఆర్ అండ్ బీ శాఖలో డీఈగా పనిచేస్తున్నానని పలువురిని నమ్మించాడు. ఈయన తన కుటుంబ సభ్యులు కలిసి గతంలో రైస్ పుల్లింగ్ ముఠాతో తిరిగినప్పుడు రుహత్ బేగ్, భీమవరం శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. వీరికి తోడు వరంగల్ రంగశాయిపేటకే చెందిన దాసు హర్ష, చిరుమర్తి సంజయ్, కొత్తగూడెంలోని రామాంజనేయ కాలనీకి చెందిన గుండా వినోద్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 60 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.4 కోట్ల వరకు వసూలు చేశారు. అయితే, డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు రాకపోవడంతో, నిందితుల నుండి సమాధానం రాకపోవడంతో బాధితులు పలువురు చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రామాంజనేయ కాలనీలోని వినోద్‌కుమార్ ఇంట్లో ఉన్నారనే సమాచారంతో హరికిషన్, హర్ష, సంజయ్, వినోద్‌కుమార్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు రుహత్ బేగ్, భీమవరం శ్రీనివాస్ పరారీలో ఉండగా.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ముఠాకు సహకరించిన మిగతా వారిని సైతం గుర్తించి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మాయమాటలు చెప్పే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కమలాపూర్: కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురిమిళ్ల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కమలాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. స్థానిక పాలనలో అన్ని కులాల ప్రాతినిధ్యం ఉండాలంటే కులగణన చేపట్టి రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీసీ డిక్లరేషన్‌సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో కులగణన ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలన్నారు. సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సైదమ్మ, ప్రధాన కార్యదర్శి చైతన్యభారతి, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, సహాయ కార్యదర్శి గోవిందు, హనుమకొండ, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాల కన్వీనర్లు మొగిలి, లక్ష్మయ్య, మోహనకృష్ణ, పాల్గొన్నారు.

దుబాయ్ వెళ్లేందుకు చోరీలు

- అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

వరంగల్ క్రైం: ఇంటి నిర్మాణంతో పాటు దుబాయ్ వెళ్లేందుకు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. నిందితుడి నుంచి రూ. 22 లక్షల విలువైన 270 గ్రాముల బంగారంతోపాటు రెండు ద్విచక్రవాహనాలు, రూ.50 వేల నగదు, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీపీ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకేపల్లి గ్రామానికి చెందిన జింక నాగరాజు ప్రస్తుతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో నివాసముంటూ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మెకానిక్‌గా పని చేస్తూనే ద్విచక్రవాహనాల క్రయవిక్రయాలు చేపడుతున్నాడు. అయితే తన జల్సాలకు ఇందులో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో పెద్ద మొత్తంలో డబ్బును సులభంగా సంపాదించాలని ఆలోచించి బైక్ చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా 2011 నుంచి కరీంనగర్, జమ్మికుంట, కామారెడ్డి, సిద్దిపేట, వేములవాడతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కి జైలు జీవితం గడిపాడు. జైలులో జీవితం అనంతరం కూడా నాగరాజు ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా, ద్విచక్రవాహనాలు చోరీలకు స్వస్తి పలికి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. 2016 నుంచి 2022 వరకు వరంగల్, జనగామ, సిద్దిపేట, భూపాలపల్లి జిల్లాలో మొత్తం 38కి పైగా తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడడంతో పోలీసులు పలుమార్లు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా గత సంవత్సరం మార్చిలో జైలు నుంచి విడుదలై తన సొంత ఇంటి నిర్మాణంతో పాటు దుబాయి వెళ్లేందుకు అవసరమైన డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా మరోమారు చోరీలకు పాల్పడుతున్నాడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు జగిత్యాల, యాదాద్రి జిల్లాలో మొత్తం 20 చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో నాగరాజు కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. మంగళవారం చోరీ చేసిన బంగారం అమ్మేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నట్లు సమాచారం రావడంతో సీసీఎస్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా ఆర్ఎన్‌టీ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. బైక్‌ను తనిఖీ చేయగా బంగారం, పెద్ద మొత్తంలో నగదు లభించింది. దీంతో విచారించగా తాను చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు సీపీ అంబర్‌కిశోర్ ఝాతెలిపారు.

అధికారులకు అభినందన..

నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్‌తో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్‌బారి, అదనపు డీసీపీ రవి, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, సీసీఎస్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు అబ్బయ్య, గోపి, అసిస్టెంట్ అనాటికల్ ఆఫీసర్ సల్మాన్‌పాషా, సీసీఎస్ ఏఎస్ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు నజీం, అహ్మద్, జంపయ్య, సిబ్బందిని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ దర్శన సమరవీర


కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని బోస్ హాల్‌లో మూడు రోజులపాటు జరిగే హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ కాన్‌క్లేవ్-24(హెచ్ఎస్ఎస్ఆర్‌సీ) ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్యాన్ నిట్ పేరిట మంగళవారం ప్రారంభమైంది. హ్యూమానిటీస్ ఎట్ ది క్రాస్ రోడ్స్-ది కన్వర్జెన్స్ ఆఫ్ లాంగ్వేజ్, లిటరేచర్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఏర్పాటు చేసిన హెచ్ఎస్ఎస్ఆర్‌సీ-24ను శ్రీలంకకు చెందిన ప్రొఫెసర్ దర్శన సమరవీర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. 21వ శతాబ్దంలో యువత సోషల్ ఈవెంట్స్, నెట్ వర్కింగ్, నైపుణ్యం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కాన్ఫరెన్స్ తోడ్పడాలన్నారు. నిట్ వరంగల్‌లో సాంకేతిక విద్యతో పాటు హ్యూమనిటీస్ ముఖ్య భూమిక పోషిస్తుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ హెడ్ కె. మాధవి, ప్రొఫెసర్ స్ఫూర్తి పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఏడుగురి మృతి

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం ఏడుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

చిల్పూరు: వడదెబ్బతో మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన తాళ్లపల్లి రాజు (40) మృతి చెందాడు. రాజు.. కొద్ది నెలలుగా మతిస్థిమితం కోల్పోయి రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఎండలో తిరిగి వడదెబ్బకు గురై వెంకటేశ్వరపల్లిలో ఓ హోటల్ వద్ద మృతి చెందాడు. కానిస్టేబుల్ వీరన్న ఘటనాస్థలికి చేరకుని రాజు మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..


చెన్నకేశవులు (ఫైల్)

కాశిబుగ్గ : రైలు కింద పడి ఓ జంట ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. దీంతో వరంగల్ కాశిబుగ్గలో విషాదం అలముకుంది. ఈనెల 24న నగరంలోని హంటర్ రోడ్డు పోతన జంక్షన్ బైపాస్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి జంట ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనలో ఖమ్మం సారథినగర్‌కు చెందిన బాలిక సుష్మ అక్కడికక్కడే మృతి చెందింది. యువకుడు మేకమల్ల చెన్నకేశవులు(19) తీవ్ర గాయాలపాలై ఐదు రోజుల నుంచి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కాగా, ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

శాయంపేట మండలంలో ఇద్దరు..

శాయంపేట : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పత్తిపాక, కొప్పుల గ్రామాల్లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. పత్తిపాకకు చెందిన దుర్షెట్టి కుమారస్వామి(35) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాయంత్రం 4గంటలకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కోతుల దండు మీది వచ్చింది. ఈ క్రమంలో కుమారస్వామి కిందపడగ తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో కుమారస్వామి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో చికిత్స పొందుతూ వ్యక్తి..

కొప్పులకు చెందిన బేతి బుచ్చిరెడ్డి (50) డ్రైవర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 15న బైక్‌పై శాయంపేట నుంచి కొప్పులకు వెళ్తున్నాడు. మైలారం వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి కింద పడింది. బుచ్చిరెడ్డికి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు. స్థానికులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళ..



సాంబ(ఫైల్)

గీసుకొండ: మండలంలోని మొగిలిచర్ల శివారు కోటమైసమ్మ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనంపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన మిట్టపెల్లి సాంబ(60) సోమవారం ఆళ్ల శివయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనం వెనుక కూర్చుని వరంగల్ ఏనుమాముల మార్కెట్ నుంచి పెద్దాపురం వెళ్తోంది. శివయ్య ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడపడంతో అదుపు తప్పి కిందపడింది. దీంతో సాంబకు తీవ్రగాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఎస్సై వెంకన్న మంగళవారం తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..

రామన్నపేట: రామన్నపేటకు చెందిన కంచర్ల రాజేశ్వరి.. వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధి సంతోషిమాత కాలనీలోని కుమార్ ఇంటిలో పనిచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో మృతిచెందారు. మోటార్ వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి మంగళవారం తెలిపారు. షాక్ గురైన వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా ఆమె మృతి చెందిన విషయాన్ని వైద్యులు ధ్రువీకరించినట్లు వివరించారు. మృతుడు కుమార్ రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని జీపీ కార్మికుడు..


సారయ్య(ఫైల్)

ములుగు: లారీ.. ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ జీపీ కార్మికుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ములుగు జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్సై లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. జీపీ కార్మికుడు బల్గూరి చిన్నసారయ్య(52) మంగళవారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో చెత్త సేకరించేందుకు వెళ్లాడు. ట్రాలీలో నిలబడి చెత్త వేస్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వచ్చిన లారీ వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో చిన్నసారయ్య ట్రాలీ డోర్‌కు బలంగా ఢీకొన్నాడు. గమనించిన తోటి సిబ్బంది ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా నే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా,విధి నిర్వహణలో ప్రాణం కోల్పోయిన మృతుడి కుటుంబానికి రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, సీపీఎం మండల కార్యదర్శి గఫూర్ పాషా డిమాండ్ చేశారు.

రియల్టర్‌కు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి: గ్రామాల్లో వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు.'సాక్షి'లో ఈ నెల 27వ తేదీన 'యథేచ్ఛగా రియల్ దందా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. ఈమేరకు గ్రామాల్లో వెంచర్లు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులపై ఉక్కు పాదం మోపడానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా హసన్‌పర్తి మండలం మడిపల్లిలో వెంచర్ ఏర్పాటుకు సిద్ధమైన ఓ రియల్టర్‌కు నోటీసులు ఇచ్చారు. స్థానిక పంచాయతీ అధికారి వెంకన్న సదరు వెంచర్ నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేసి హద్దులు నిర్ధారిస్తే వాటిని తొలగించడమే కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో సీఏ

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన సీఏ..సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీలో సీఏగా పని చేస్తున్న కొత్తపల్లిగోరికి చెందిన సీఏకు తెలియకుండా సైబర్ నేరగాళ్లు తన అకౌంట్ నుంచి ఈ నెల 26న రూ.15 వేలు, 28న రూ.10 వేలు తస్కరించారు. ఖాతా నుంచి నగదు పోగొట్టుకున్న సదరు సీఏ మోసపోయానని గ్రహించి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.